సాక్షి
అనంతపురం
శనివారం ꠰ 6 ꠰ జూలై ꠰ 2024



చీనీ టన్ను రూ.20 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.20 వేలు పలికాయి.



టమాట కిలో రూ.35

అనంతపురం కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్ట ధర రూ.35 పలికింది. కనిష్టం రూ.23, సరాసరి రూ.30 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
35.3°/24.2°

జిల్లా అంతటా శుక్రవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 12 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

7 నుంచి గూగూడు ఉత్సవాలు



గూగూడులో పర్యటిస్తున్న కలెక్టర్

నార్పల: మతసామరస్యానికి ప్రతీకగా జరుపుకొనే మొహర్రం (పీర్ల) పండుగను పురస్కరించుకుని గూగూడులో ఈ నెల ఏడో తేదీ నుంచి 13 వరకు కుళ్లాయిస్వామి ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఏపీతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలిరానున్నారు. ఉత్సవాల ఏర్పాట్లపై సమీక్షించేందుకు కలెక్టర్ శుక్రవారం గూగూడుకు వచ్చారు. తొలుత కలెక్టర్ కుళ్లాయిస్వామిని దర్శించుకున్నారు. అనంతరం అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఉత్సవాల నిర్వహణపై తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. వర్షకాలం కావడంతో పారిశుధ్య పనులు ఎప్పటికప్పుడు చేయాలన్నారు. భక్తులకు తాగునీరు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు హుస్సేనప్ప, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎంపీడీఓ రాముడు, ఈవోఆర్‌డీ శైలజారాణి, ఈఓ శోభ, ఎస్‌ఐ రాజశేఖర్‌రెడ్డి, ఇంజినీర్ రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

10న పెన్షన్ అదాలత్

అనంతపురం సిటీ: ఈపీఎస్ పెన్షనర్ల సమస్యలు పరిష్కరించేందుకు ఈ నెల 10న పెన్షన్ అదాలత్ నిర్వహించనున్నట్లు ఆ శాఖ కడప రీజనల్ పీఎఫ్ కమిషనర్–2 గౌరవ్ మహల్వాల్ తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జూలై నెలకు సంబంధించి వెబెక్స్ వేదికగా పెన్షన్ అదాలత్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పెన్షనర్లతో పాటు సమీప భవిష్యత్‌లో పెన్షనర్లు కానున్న వారి సమస్యలను పరిష్కరించడమే అదాలత్ ముఖ్య ఉద్దేశమన్నారు. తమ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురాదలచిన వారు https://meet309.webex.com/meet309/j.php?MTID=m0b-de3671619d8e427ae3493e55c6f37సంప్రదించాలని సూచించారు.

మీటింగ్ నంబర్	: 2644 663 9754
పాస్వర్డ్	: 1234
తేదీ	: 10.7.2024
సమయం	: ఉదయం 11 గంటలు

2 హాల్‌మార్క్ సెంటర్ల సీజ్



సీజ్ చేసిన కంప్యూటర్లు, ఇతర పరికరాలు

తాడిపత్రి టౌన్: బంగారు ఆభరణాలపై అనధికారికంగా హాల్‌మార్క్ ముద్రిస్తున్నట్లు అందిన పక్కా సమాచారం మేరకు బీఐఎస్ (బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్) అధికారులు శుక్రవారం తాడిపత్రి పెద్దబజార్‌లోని హాల్‌మార్క్ సెంటర్లపై దాడులు నిర్వహించారు. సిరిపురి, సుదర్శన్ హాల్‌మార్క్ సెంటర్లలో అనుమతులు లేకుండానే బంగారు ఆభరణాలపై హాల్‌మార్క్ ముద్రిస్తున్నట్లు గుర్తించారు. ఆ రెండు సెంటర్లలో కంప్యూటర్లతో పాటు ఇతర పరికరాలను సీజ్ చేసి, కేసు నమోదు చేసినట్లు బీఎస్‌ఐ జాయింట్ డైరెక్టర్ రమాకాంత్‌సాగర్ తెలిపారు.

బీమా ధీమా ఎప్పుడో?



పంటల బీమా పథకం అమలుపై చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి సర్కారు ఇంకా ఎటూతేల్చలేదు. గత ఐదేళ్ల కాలంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేసినట్లుగా ఉచితంగా అమలు చేయాలా.. లేదంటే రైతుల నుంచి ప్రీమియం కట్టించుకుని అమలు చేయాలా అనేదానిపై స్పష్టత ఇవ్వలేదు. అయితే పాత పద్ధతి అంటే రైతులపై ప్రీమియం భారం మోపడానికి మొగ్గు చూపుతున్నట్లు సూత్రప్రాయంగా తెలుస్తోంది.

- వర్షాభావంతో గతేడాది పూర్తిగా దెబ్బతిన్న ఖరీఫ్, రబీ పంటలు
- ఏటా జూన్‌లోనే ఉచిత పంటల బీమా కింద పరిహారం
- గత ప్రభుత్వ హయాంలో రైతులకు రూ.1,883 కోట్లు
- మొదటి నాలుగేళ్లు అతివృష్టి, గతేడాది మాత్రం అనావృష్టి
- నిబంధనల మేరకు ఈసారి కూడా పెద్ద ఎత్తున పరిహారం!
- పంటల బీమా పథకంపై నోరుమెదపని 'బాబు' సర్కారు

2014-2018 మధ్య చంద్రబాబు హయాంలో రైతుల నుంచి ప్రీమియం కట్టించుకుని పంటల బీమా కింద ఇచ్చిన పరిహారం..

సంవత్సరం	రైతులు కట్టిన ప్రీమియం	వచ్చిన పరిహారం	లబ్ధిదారుల సంఖ్య
2014-15	రూ.14.09 కోట్లు	రూ.25.61 కోట్లు	47,627
2015-16	రూ.115.06 కోట్లు	రూ.109.66 కోట్లు	1,85,194
2016-17	రూ.44.64 కోట్లు	రూ.419.10 కోట్లు	5,07,658
2017-18	రూ.72.10 కోట్లు	రూ.159.70 కోట్లు	3,10,115
2018-19	రూ.80.02 కోట్లు	--	--
ఐదేళ్లలో	రూ.325.91 కోట్లు	రూ.714.07 కోట్లు	10,50,594

జగన్ హయాంలో ఉచిత పంటల బీమా కింద ఉమ్మడి జిల్లాకు వచ్చిన పరిహారం ఇలా..

సంవత్సరం	లబ్ధిపొందిన రైతులు	వచ్చిన పరిహారం (రూ. కోట్లలో)
2019-20	4,52,074	362.14
2020-21	2,46,469	266.04
2021-22	4,04,462	855.53
2022-23	3,17,567	369.09
నాలుగేళ్లలో	14,20,572	1,882.80

అనంతపురం అగ్రికల్చర్: ఖరీఫ్–2024 సీజన్ మొదలైంది. రాష్ట్రంలో కొలువుదీరిన టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి ప్రభుత్వం పంటల బీమాపై ఎటువంటి ప్రకటనా చేయకపోవడంతో రైతుల్లో అయోమయం నెలకొంది. గత జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు ఈ–క్రాప్ ఆధారంగా అత్యంత పారదర్శకంగా ఉచిత పంటల బీమా పథకం అమలు చేసింది. ఖరీఫ్ మొదలు కాగానే ఉచిత బీమా కింద అటు వ్యవసాయ, ఇటు ఉద్యాన పంటలను నోటిఫై చేస్తూ వాతావరణ, ఫసల్‌బీమా పథకాలు అమలు చేసింది. ఇలా ఏటా పది వ్యవసాయ పంటలు, నాలుగు ఉద్యాన పంటలకు బీమా వర్తింపజేసి రాష్ట్ర ప్రభుత్వమే రైతుల తరఫున బీమా కంపెనీలకు ప్రీమియం చెల్లించి.. నిబంధనల మేరకు పరిహారం వచ్చేలా గట్టి చర్యలు తీసుకుంది. అందులోనూ 2019 నుంచి వరుసగా నాలుగేళ్లు కరువు తీరేలా వర్షాలు కురిశాయి. ఇలా అతివృష్టి సంభవించినా రైతులకు బీమాతో ధీమా కల్పించారు. మొదటి నాలుగేళ్ల కాలంలోనే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏకంగా 14.20 లక్షల మంది రైతులకు రూ.1,883 కోట్ల పరిహారం జమచేయడం విశేషం. ఈ క్రమంలో గతేడాది అంటే 2023 ఖరీఫ్‌కు సంబంధించి జూన్‌లో బీమా పథకం కింద పరిహారం రావాల్సి ఉంది. ఏటా ఇలా జూన్‌లోనే పరిహారం ఇస్తూ వచ్చారు. అది కూడా గతేడాది అనావృష్టి పరిస్థితులు ఏర్పడ్డాయి. పంటలన్నీ దాదాపు తుడిచిపెట్టుకుపోయాయి. గత ప్రభుత్వం కరువు జిల్లాలను ప్రకటించింది. దీంతో గతేడాదికి సంబంధించి బీమా పథకం కింద పెద్ద మొత్తంలో పరిహారం రావడానికి అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

- అనంతపురం జిల్లాకు సంబంధించి గత ఖరీఫ్‌లో మండలం యూనిట్‌గా వేరుశనగ, పత్తి, చీనీ, దానిమ్మ, టమాట పంటకు వాతావరణ బీమా కల్పించారు. జిల్లాలో ఉన్న 214 ఆటోమేటిక్ వెదర్‌స్టేషన్లలో నమోదైన వర్షపాతం, ఉష్ణోగ్రతలు, ఇతరత్రా వాతావరణ గణాంకాల ఆధారంగా బీమా పరిహారం లెక్కిస్తారు. ఇక ఫసల్‌బీమా కింద గ్రామం యూనిట్‌గా కంది, మండలం యూనిట్‌గా వరి, జొన్న, మొక్కజొన్న, ఆముదం, ఎండుమిరపకు ఇచ్చారు. ప్రణాళికశాఖ నిర్వహించే పంటకోత ప్రయోగాలు, వాటి దిగుబడుల ఆధారంగా ఈ పంటలకు బీమా పరిహారం లెక్కించనున్నారు.
- శ్రీసత్యసాయి జిల్లా పరిధిలో తీసుకుంటే ఖరీఫ్‌లో వాతావరణ బీమా కింద వేరుశనగ, పత్తి, చీనీ, దానిమ్మ, టమాటకు వర్తింపజేశారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 173 వెదర్‌స్టేషన్లలో నమోదైన వాతావరణ గణాంకాలను పరిగణనలోకి తీసుకుంటారు. అలాగే ఫసల్‌బీమా కింద గ్రామం యూనిట్‌గా కంది, మండలం యూనిట్‌గా వరి, మొక్కజొన్న, అలాగే జిల్లా యూనిట్ కింద ఆముదం, రాగి పంటలకు బీమా వర్తింపజేశారు.

పంటల వారీగా బీమా పరిహారం..

ఉమ్మడి జిల్లా పరిధిలో వాతావరణ బీమా పథకం కింద వేరుశనగ పంటకు హెక్టారుకు రూ.72,500, పత్తికి రూ.90 వేలు, దానిమ్మకు రూ.1.75 లక్షలు, చీనీకి రూ.1.25 లక్షలు, టమాటకు రూ.80 వేల చొప్పున పరిహారం వర్తింపజేశారు. అలాగే ఫసల్‌బీమా కింద కంది హెక్టారుకు రూ.45 వేలు, వరికి రూ.97,500, జొన్నకు రూ.50 వేలు, మొక్కజొన్నకు రూ.80 వేలు, ఎండుమిరపకు రూ.2 లక్షలు, రాగికి రూ.45 వేలు, తొలిసారిగా బీమా పథకంలో నోటిఫై చేసిన ఆముదం పంటకు సంబంధించి అనంతపురం జిల్లాలో హెక్టారుకు రూ.45 వేలు, శ్రీసత్యసాయి జిల్లాలో రూ.40 వేలు చొప్పున పరిహారం ఖరారు చేశారు.

నేడు శాస్త్రవేత్తల బృందం రాక

- ఉమ్మడి జిల్లాలో చీనీ తోటల స్థితిగతుల పరిశీలన

అనంతపురం అగ్రికల్చర్: చీనీ తోటల స్థితిగతులు, రైతుల అనుభవాలు తెలుసుకునేందుకు ఢిల్లీలోని భారతీయ ఉద్యాన పరిశోధన కేంద్రం నుంచి పది మంది శాస్త్రవేత్తలతో కూడిన బృందం శనివారం ఉమ్మడి జిల్లాకు వస్తోంది. డాక్టర్ రాజేశ్వర్‌సింగ్ చాండెల్, డాక్టర్ వాస్కాసింగ్ దిల్లాన్, డాక్టర్ ఏఎస్ గణేష్‌మూర్తి, డాక్టర్ పీకే చక్రవర్తి, ప్రొఫెసర్ రామక్రిష్ణపాల్, డాక్టర్ ఏకే దాస్, డాక్టర్ ఏ.తిరుంగన్‌వేల్, డాక్టర్ సుబ్రహ్మణ్యం, డాక్టర్ కేటీ వెంకటరమణ, డాక్టర్ శ్రీనివాసరెడ్డితో కూడిన బృందం పర్యటన వివరాలను అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల ఉద్యాన అధికారులు జి.ఫిరోజ్‌ఖాన్, జి.చంద్రశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. చీనీ సాగులో పాటిస్తున్న యాజమాన్య పద్ధతులు, వస్తున్న దిగుబడులు, మార్కెటింగ్, ఇటీవల కాలంలో ఆశిస్తున్న చీడపీడలు, వాటి నివారణ పద్ధతుల గురించి శనివారం మధ్యాహ్నం అనంతపురం డ్వామా హాలులో హార్టికల్చర్ అధికారులతో సమావేశం నిర్వహిస్తారని తెలిపారు. అనంతరం గార్లదిన్నె మండలం మర్తాడు గ్రామంలో చీనీ తోటలను పరిశీలించి రైతులతో మాట్లాడనున్నట్లు వెల్లడించారు. మరుసటి రోజు ఆదివారం శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లిలో నర్సరీలను సందర్శించనున్నట్లు తెలిపారు. అధిక దిగుబడులు, చీడపీడల నివారణకు సంబంధించి సాంకేతిక పద్ధతులు, మేలైన యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ సలహాలు, సిఫారసులు చేసే అవకాశం ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. రాష్ట్రంలో మరికొన్ని జిల్లాల్లో ఈ బృందం పర్యటించే అవకాశం ఉందన్నారు.

భారత బాస్కెట్‌బాల్ జట్టులో అనంత కుర్రాడు



ద్వారకనాథరెడ్డి

అనంతపురం: భారత బాస్కెట్‌బాల్ జట్టులో అనంతపురం నగరానికి చెందిన ద్వారకనాథరెడ్డి చోటు దక్కించుకున్నాడు. ఇతను అండర్–18 విభాగానికి ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. సౌత్ ఏసియా బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ టోర్నీ ఈ నెల 9న శ్రీలంకలో ప్రారంభం కానుంది. ఇందులో భారతదేశం జట్టు తరఫున పోటీల్లో పాల్గొంటాడు. ఇటీవలే భారత జట్టు తరఫున నిర్వహించిన క్రీడా క్యాంపులోనూ ప్రతిభ చాటడంతో జట్టులో స్థానం దక్కింది. ఈ సందర్భంగా ద్వారకనాథరెడ్డిని జిల్లా బాస్కెట్‌బాల్ ప్రెసిడెంట్ కేఎం హబీబుల్లా, సెక్రెటరీ కె.నరేంద్ర చౌదరి అభినందించారు.

టీబీ డ్యాంకు మరింత పెరిగిన ఇన్‌ఫ్లో

అనంతపురం సెంట్రల్/బొమ్మనహాళ్: కరువు జిల్లాకు వరప్రదాయినిగా ఉన్న తుంగభద్ర జలాశయానికి వరద పోటెత్తుతోంది. ఎగువన కురుస్తున్న వర్షాలకు తుంగ జలాశయం పూర్తిగా నిండడంతో వరద నీటిని దిగువకు వదిలేస్తున్నారు. బుధవారం 10 వేల క్యూసెక్కులుగా ఉన్న ఇన్‌ఫ్లో శుక్రవారం 20వేల క్యూసెక్కులకు పెరిగింది. దీంతో జలాశయంలో 105.788 టీఎంసీల పూర్తి మట్టానికి గాను 12 టీఎంసీల వరకు నీరు చేరింది. అవుట్‌ఫ్లో 295 క్యూసెక్కులుగా నమోదైంది. 1,633 అడుగుల డ్యాం ఎత్తుకు గాను 1590.80 అడుగు వరకు నీళ్లు చేరాయి. ఇటీవల జరిగిన తుంగభద్ర బోర్డు సమావేశంలో ఈ ఏడాది 172 టీఎంసీల నీటి లభ్యత ఉంటుందని భావించిన అధికారులు దామాషా ప్రకారం హెచ్చెల్సీకి 26.368 టీఎంసీలు కేటాయింపులు చేశారు. ఈ నెలాఖరులో హెచ్చెల్సీకి నీరు విడుదల చేయాలని నిర్ణయించారు.

ఈ మూడు నెలలే కీలకం

తుంగభద్ర జలాశయానికి ఏటా జూలై నుంచే ఇన్‌ఫ్లో అత్యధికంగా వస్తోంది. మే ఆఖరు, జూన్‌లో ఎప్పుడూ అరకొరగా వర్షాలు కురుస్తుండడంతో పెద్దగా నీరు చేరడం లేదు. జూన్, జూలై, ఆగస్టు నెలల్లో కురిసే భారీ వర్షాలకు జలాశయం నిండుతోంది. గతేడాది జూన్‌లో 0.985 టీఎంసీలు మాత్రమే వచ్చింది. జూలైలో 70.174 టీఎంసీలు, ఆగస్టులో 24.322 టీఎంసీలు, సెప్టెంబర్‌లో 5.132 టీఎంసీలు వచ్చి చేరాయి. ఈ ఏడాది ఆశాజనకంగా వర్షాలు వస్తాయని అధికారులు భావిస్తున్నారు.



నీటిని తీసుకోవడానికి సిద్ధం

తుంగభద్ర జలాశయానికి ఇన్‌ఫ్లో ఆశాజనకంగా వస్తోంది. వర్షాలు కొనసాగుతుండడం వలన మరింత ఎక్కువ వచ్చే అవకాశమున్నట్లు తెలుస్తోంది. అనుకున్నట్లుగా ఈ నెలాఖరులో నీటిని విడుదల చేస్తారని భావిస్తున్నాం. నీటిని తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నాం. కాలువ మరమ్మతు పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తున్నాం.

– రాజశేఖర్, ఎస్‌ఈ, హెచ్చెల్సీ

అతిథిగృహం పనుల్లో అక్రమాలు

- ఆర్‌అండ్‌బీ ఇంజినీర్లకు నచ్చిన వారికే పనుల అప్పగింత
- టెండరు పిలిచి ఆపేసి.. ఆ తర్వాత నచ్చిన కాంట్రాక్టరుకు పనులు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: అనంతపురం నడిబొడ్డున ఉన్న రోడ్లు, భవనాల అతిథిగృహం మరమ్మతు పనుల్లో అవకతవకలు జరిగినట్టు తెలుస్తోంది. ఇందులో కాంట్రాక్టరుతో పాటు ఆర్ అండ్‌బీ ఇంజినీర్ల ప్రమేయం ఉన్నట్లు విమర్శలు వస్తున్నాయి. అనుమతులు లేకపోయినా తమకు నచ్చిన కాంట్రాక్టరుకు పనులు అప్పజెప్పి లక్షల రూపాయల దుర్వినియోగానికి పాల్పడినట్టు సమాచారం.

టెండరు పిలిచి.. ఆపేసి

ఆర్‌అండ్‌బీ అతిథి గృహం మరమ్మతుల కోసం ఈ ఏడాది మార్చి 4వ తేదీన టెండరు పిలిచారు. నలుగురు కాంట్రాక్టర్లు టెండరులో పాల్గొన్నారు. ఆర్థిక బిడ్ తెరిచారు. తర్వాత టెండరు అమలు చేయలేదు. అత్యవసర పనుల పేరిట ఓ కాంట్రాక్టరుకు అప్పజెప్పారు. ఆ పనులకు ఇప్పటికీ అధికారిక అనుమతి రాలేదు. అయినప్పటికీ సదరు కాంట్రాక్టరు రూ.15 లక్షల విలువైన పనులు చేశారని ఆర్ అండ్‌బీ ఇంజినీర్ ఒకరు చెప్పారు. టెండరు ఎందుకు ఆపేశారు, వెంటనే మరో కాంట్రాక్టరుకు నామినేషన్ కింద పనులు ఎందుకు ఇచ్చారన్నది అర్థం కావడం లేదు. సదరు కాంట్రాక్టర్ ఫ్లోరింగ్, బాత్‌రూం టైల్స్, పెయింటింగ్ పేరుతో పనులు ఆదరాబాదరా చేసినట్టు తెలుస్తోంది.

అంతకుముందే రూ.10 లక్షల పనులు

మార్చి మాసంలోనే అనంతపురానికి గవర్నర్ వస్తున్నారని ఆగమేఘాలపై ఆర్‌అండ్‌బీ అధికారులు పనులు చేయించారు. సివిల్ పనులు రూ.5 లక్షలు, ఎలక్ట్రికల్ పనులు మరో రూ.5 లక్షలకు అదే కాంట్రాక్టర్‌కు ఇచ్చారు. ఇవి కూడా నామినేషన్ కింద కట్టబెట్టారు. బిల్లులు కూడా మంజూరయ్యాయి. ఈ పనులకు ఎంత వ్యయం అవుతుంది, ఎంత ఖర్చు చేశారన్న కనీస పరిశీలన కూడా లేకుండా బిల్లులు అప్‌లోడ్ చేసినట్టు విమర్శలు వస్తున్నాయి.

పర్సెంటేజీ ఇస్తేనే..

ఉమ్మడి అనంతపురం జిల్లాలో పలు రోడ్లు, భవనాల నిర్మాణ పనులు జరిగాయి. వీటి విషయంలో ఆర్‌అండ్‌బీ ఇంజినీర్లపై తీవ్ర విమర్శలు వచ్చాయి. ఎలాంటి పని అయినా సరే అగ్రిమెంటు దశలోనే ఒకటి నుంచి రెండు శాతం కమీషన్ అధికారులకు చెల్లించాల్సి వస్తోందని కాంట్రాక్టర్లు వాపోతున్నారు. నిర్మాణాలు పూర్తయినా బిల్లులు అప్‌లోడ్ చేయరని, చివరకు ఈఓటీ (కాలపరిమితి పెంపు)కి కూడా డబ్బు వసూలు చేస్తున్నారని కాంట్రాక్టర్లు వాపోతున్నారు.

అత్యవసరంగా చేయాల్సి ఉంటుంది

వీఐపీలు వచ్చినప్పుడు కొన్ని పనులు అత్యవసరంగా చేయాల్సి ఉంటుంది. ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ పనుల విషయంలో సెక్రెటరీ ఆదేశాల మేరకు ముందుకు వెళ్లాం. మీరు పనులు మొదలుపెట్టండి. నేను అనుమతులు ఇస్తానన్నారు. ఆ తర్వాత అనుమతులు రాలేదు. ఈ పనులకు సంబంధించి ఏదో ఒక రూపంలో రెగ్యులరైజ్ చేసి బిల్లులు ఇవ్వడానికి ప్రయత్నిస్తున్నాం.

–ఓబుల్‌రెడ్డి, ఎస్‌ఈ, రోడ్లు, భవనాల శాఖ

పత్తి తూకాల్లో మోసం

- దళారులకు దేహశుద్ధి చేసిన రైతులు
- అదనపు 'నొక్కుడు'కు మూల్యం చెల్లింపు



దళారులతో వాగ్వాదం చేస్తున్న రైతులు



రైతులను మోసం చేసిన దళారులు వీళ్లే



పత్తిని లోడ్ చేసిన ఐచర్ వాహనం

బొమ్మనహాళ్: పత్తి కొనుగోళ్ల కోసం వచ్చిన దళారులు రైతులను తూకాల్లో మోసం చేశారు. అనుమానం వచ్చిన రైతులు సమీపంలోని వేబ్రిడ్జి వద్ద తూకం వేయించగా అసలు విషయం బయటపడింది. తమ కష్టార్జితాన్ని దోచుకునేందుకు ప్రయత్నించిన దళారులకు దేహశుద్ధి చేసి గుణపాఠం చెప్పారు. వివరాల్లోకెళ్తే.. బొమ్మనహాళ్ మండలం గోనూరు గ్రామ రైతులు పలువురు పత్తి పంట సాగు చేశారు. విడిపించిన పత్తిని విక్రయానికి సిద్ధం చేశారు. బళ్లారి మార్కెట్‌కు తీసుకెళ్లాల్సి ఉంది. మేలురకం పత్తి క్వింటాలు ధర రూ.7,600 నుంచి రూ.8వేల వరకు పలుకుతోంది. అయితే శుక్రవారం కర్నూలు జిల్లా ఆదోని నుంచి కొందరు దళారులు ఐషర్ వాహనంలో గోనూరు గ్రామానికి వచ్చారు. తాము పత్తి కొంటామని, క్వింటాలు ధర రూ.8,250 అని చెప్పారు. మార్కెట్ కన్నా ధర ఎక్కువగానే లభిస్తోందని, పైగా రవాణా, కూలీలు, కమీషన్ ఖర్చులు తగ్గిపోతాయని పలువురు రైతులు అమ్మడానికి ముందుకొచ్చారు. రైతులు కొల్లేరప్ప (31 క్వింటాళ్లు), నాగరాజు (18 క్వింటాళ్లు), తిప్పయ్య (23 క్వింటాళ్లు) నుంచి మొత్తం 72 క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేశారు. వీరిలో రైతు కొల్లేరప్ప ఇదివరకే పత్తి బస్తాలను తూకం వేయించినపుడు 36 క్వింటాళ్లు వచ్చింది. ప్రస్తుతం దళారులు వేసిన తూకంలో 31 క్వింటాళ్లే రావడంతో అనుమానం వచ్చింది. తమకు తూకంలో మోసం జరిగినట్లు అనుమానం ఉందని దళారులతో గొడవకు దిగారు. తాము కరెక్టుగానే తూకాలు వేసినట్లు దళారులు దబాయించారు. అక్కడి నుంచి నేరుగా ఎల్బీనగర్ వద్దనున్న వేబ్రిడ్జి కాటాలో పత్తిని వాహనంతో సహా తూకం వేయించారు. రైతుల నుంచి సేకరించిన 72 క్వింటాళ్లతో పాటు అదనంగా 12 క్వింటాళ్లు కాటాలో చూపించింది. తమ వద్ద తూకం వేసినపుడు మొబైల్‌లో సెన్సార్ యాప్ ద్వారా స్కేల్‌లో నంబర్లను తక్కువగా చూపించి మోసం చేసినట్లు రైతులు గుర్తించారు. ఆగ్రహించిన రైతులు దళారులకు దేహశుద్ధి చేశారు. స్థానికులు పంచాయితీ చేసి తూకాల్లో కొల్లగొట్టిన అదనపు 12 క్వింటాళ్ల పత్తికి డబ్బు చెల్లించేందుకు దళారులను ఒప్పించారు. అయితే తమ వద్ద అంత నగదు లేకపోవడంతో దళారులు సదరు రైతులను బళ్లారికి తీసుకెళ్లి అక్కడ వారికి పైకం చెల్లించారు. దీంతో సమస్య సద్దుమణిగింది.

సంతకాలకూ కిరికిరి

- వివిధ సర్టిఫికెట్ల కోసం విద్యార్థులు, తల్లిదండ్రుల దరఖాస్తు
- అర్బన్, రూరల్ మండలాలకు వేర్వేరు తహసీల్దార్లు
- అర్బన్ తహసీల్దార్ ఒక్కరికే డిజిటల్ 'కీ'



అనంతపురం అర్బన్, రూరల్ తహసీల్దార్ కార్యాలయాలు

రాప్తాడు రూరల్: అనంతపురం అర్బన్, రూరల్ తహసీల్దార్ కార్యాలయాల్లో తహసీల్దార్ 'డిజిటల్ కీ' సంతకం కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఒకటిగా ఉన్న ఈ కార్యాలయాన్ని పెరిగిన జనాభా దృష్ట్యా వేర్వేరు మండలాలుగా విభజించారు. తహసీల్దార్ మొదలుకుని కింది స్థాయి ఉద్యోగి వరకూ అన్ని రెండేసి పోస్టులు నియామకం చేశారు. ఈ క్రమంలో మీసేవ, సచివాలయాల ద్వారా దరఖాస్తు చేసుకున్న వివిధ సర్టిఫికెట్ల మంజూరుకు అవసరమైన తహసీల్దార్ 'డిజిటల్ కీ'ని మాత్రం వేరు చేయలేకపోయారు. ప్రస్తుతం ఈ 'డిజిటల్ కీ' అర్బన్ తహసీల్దార్‌కు మాత్రమే ఉంది. రూరల్ పరిధిలోని సర్టిఫికెట్లకు కూడా ఆయనే డిజిటల్ సంతకం చేయాల్సి ఉన్నా... చేయకపోవడంతో అసలు సమస్య మొదలైంది.

క్యూ కడుతున్న రూరల్ మండల ప్రజలు

విద్యా సీజన్ ప్రారంభం కావడంతో అర్బన్, రూరల్ మండలాలకు చెందిన వేలాదిమంది విద్యార్థులు ఇంటిగ్రేటెడ్, ఆదాయ, ఈడబ్ల్యూఎస్, కుల ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగానే సంబంధిత వీఆర్‌ఓ పరిశీలించి ఆమోద ముద్ర వేస్తారు. ఆ తర్వాత ఆర్‌ఐ, డిప్యూటీ తహసీల్దార్ సంతకం చేయాల్సి ఉంటుంది. వీరి తర్వాత తుదిగా డిజిటల్ కీ సంతకం ద్వారా తహసీల్దార్ ఆమోద ముద్ర వేయగానే సర్టిఫికెట్లు మంజూరవుతాయి. అర్బన్ మండల పరిధిలో ఈ సమస్య పెద్దగా లేకపోయినా రూరల్ మండలాల ప్రజలకు చాలా ఇబ్బందిగా ఉంటోంది. రూరల్ పరిధిలోని సర్టిఫికెట్లకు సంతకాలు చేసే విషయంలో అర్బన్ తహసీల్దార్ పెద్దగా చొరవ తీసుకోవడం లేదు. వీఆర్‌ఓ, ఆర్‌ఐ, డీటీ సంతకాలు పూర్తయినా తహసీల్దార్ డిజిటల్ కీ సంతకం కోసం పెండింగ్ పడుతున్నాయి. వాటికి సంబంధించి హార్డ్‌కాపీలను అర్బన్ తహసీల్దార్ కార్యాలయానికి అందజేసినా సంతకాలు చేసే విషయంలో మాత్రం అలసత్వం ప్రదర్శిస్తున్నారంటూ ప్రజలు వాపోతున్నారు. ఈ విషయంలో తాము ఎన్నిసార్లు చెప్పినా అర్బన్ తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పట్టించుకోవడం లేదంటూ రూరల్ తహసీల్దార్ కార్యాలయ సిబ్బందే చెబుతున్నారు. ఈ క్రమంలో తహసీల్దార్ కార్యాయాలనికి రూరల్ మండల ప్రజలు బారులు తీరుతున్నారు.

ఏది అర్బన్, ఏది రూరల్ ?

వాస్తవానికి అర్బన్, రూరల్ తహసీల్దార్ కార్యాలయాలు వేర్వేరు అయినా ఒకే బిల్డింగ్‌లో ఏర్పాటు చేయడం పెద్ద సమస్యగా మారింది. రోజూ వందల సంఖ్యలో వివిధ పనులపై తహసీల్దార్ కార్యాలయానికి వస్తుంటారు. ఏ కార్యాలయం ఎక్కడ ఉందో అవగాహన లేక జనాలు నేరుగా వెళ్తున్నారు. అక్కడికి వెళ్లగానే ఇది రూరల్ కార్యాలయం.. పక్కన అర్బన్ కార్యాలయంలోకి వెళ్లాలని, అక్కడికి వెళ్తే ఇది అర్బన్ కార్యాలయం పక్కన రూరల్ కార్యాలయానికి వెళ్లాలని సిబ్బంది చెబుతున్నారు. మరి కొందరు సిబ్బంది అయితే పనుల మీద వచ్చే జనాలపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఈ రెండు కార్యాలయాలను వేర్వేరు ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తే ఎక్కడి ప్రజలు అక్కడి కార్యాలయానికి వెళ్తారని దీంతో జనాల తాకిడి కూడా తగ్గుతుందని ఉద్యోగులు అంటున్నారు.

More than 45 English Posts achieved in previous DSCs
TET+DSC ENGLISH Offline & Online Live
Grammar, Literature, Poetry, Prose & Methods.
SA, TGT, PGT, Proficiency Test Classes
NICE ACADEMY Balaji School, ANANTAPUR. 9440745862, 9959557340

అల్లుడే కాలయముడు..

- మరో ఇద్దరితో కలసి మామపై దాడి
- వేటకొడవండ్లతో నరికి హతమార్చిన వైనం
- భార్యను కాపురానికి పంపలేదనే కక్షతో దారుణం
- నిందితుడిని పట్టించిన పోలీసు జాగిలం

గుంతకల్లు రూరల్: అల్లుడే కాలయముడయ్యాడు. కుమార్తెను కాపురానికి పంపలేదన్న కక్షతో మరో ఇద్దరితో కలసి వేటకొడవండ్లతో విచక్షణారహితంగా దాడి చేశాడు. ఘటనలో మామ అక్కడికక్కడే హతమయ్యాడు. విషయం తెలుసుకున్న పోలీసులు, కుటుంబసభ్యులతో పాటు ఏమీ తెలియని వాడిలా తానూ అక్కడకు చేరుకున్నాడు. క్షణాల వ్యవధిలోనే స్నిప్పర్ డాగ్ నిందితుడిని పోలీసులకు పట్టించింది. గుంతకల్లు రూరల్ ఎస్ఐ సురేష్ తెలిపిన మేరకు....

మేనల్లుడికే కట్టబెట్టి

గుంతకల్లు మండలం నల్లదాసరపల్లికి చెందిన లక్ష్మన్న (50), కృష్ణవేణి దంపతులకు నలుగురు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్న లక్ష్మన్న.. నాలుగేళ్ల క్రితం తన రెండో కుమార్తె లలితను కర్నూలు జిల్లా చిప్పగిరి మండలం దౌల్తాపురం గ్రామంలో నివాసముంటున్న తన సొంత అక్క కుమారుడు చంద్రశేఖర్‌కు ఇచ్చి పెళ్లి జరిపించాడు. కొన్నాళ్ల పాటు వీరి సంసారం సాఫీగా సాగింది. ఆ తర్వాత కలతలు మొదలయ్యాయి. మొదటి కాన్పు కోసం పుట్టింటికి వచ్చిన కుమార్తె తన భర్త వేధింపుల గురించి తల్లిదండ్రుల వద్ద చెప్పుకుని బాధపడింది.

వేధింపులు తాళలేక పుట్టింటికి

మొదటి కాన్పులో కూతురును ప్రసవించిన అనంతరం కుమార్తెకు తల్లిదండ్రులు నచ్చజెప్పి కాపురానికి పంపారు. ఎవరెన్ని చెప్పినా భర్త ప్రవర్తనలో మార్పు రాలేదు. ఈ క్రమంలోనే ఏడాది క్రితం వేధింపులు తాళలేక పుట్టింటికి చేరుకుంది. ఆ తర్వాత ఆమె కాపురానికి వెళ్లలేదు. అప్పటికే లలిత మూడు నెలల గర్భిణి. తన భార్యను కాపురానికి పంపాలని చంద్రశేఖర్ తరచూ గొడవపడేవాడు. కొన్ని నెలల క్రితం పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ కూడా పెట్టారు. అక్కడ కూడా లక్ష్మన్న తన కుమార్తెను కాపురానికి పంపే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. ఆ సమయంలో చంద్రశేఖర్ ఆవేశంతో ఊగిపోతూ లక్ష్మన్నను చంపుతానని రెచ్చిపోయాడు. పెద్ద మనుషులు నచ్చచెప్పడంతో అప్పటికి సమస్య సద్దుమణిగింది.



హతుడు లక్ష్మన్న

మాటు వేసి... హతమార్చి

మామపై కక్ష పెంచుకున్న చంద్రశేఖర్ అదను కోసం కాచుకున్నాడు. గురువారం గుంతకల్లుకు చేరుకున్న లక్ష్మన్న బ్యాంకులో రుణం చెల్లించి రాత్రి స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యాడు. అప్పటికే తిమ్మాపురం – నల్లదాసరపల్లి గ్రామాల మధ్యన తన అన్న రాజశేఖర్, మరో వ్యక్తితో కలసి మాటువేసిన చంద్రశేఖర్... ఒంటరిగా వస్తున్న లక్ష్మన్నపై ఒక్కసారిగా విరుచుకు పడ్డాడు. వేటకొడవండ్లతో విచక్షణారహితంగా దాడి చేయడంతో లక్ష్మన్న అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం మృతదేహాన్ని పక్కనే ఉన్న చెట్ల మాటున పడేసి వెళ్లిపోయారు.

పట్టించిన పోలీసు జాగిలం

గురువారం అర్ధరాత్రి సమయంలో అటుగా వెళుతున్న వాహనదారులు రోడ్డుపై పడి ఉన్న రక్తపు మరకలు గమనించి అనుమానంతో చుట్టుపక్కల గాలించారు. చెట్ల మాటున పడి ఉన్న లక్ష్మన్న మృతదేహాన్ని గమనించి సమాచారం ఇవ్వడంతో కుటుంబసభ్యులతో పాటు పోలీసులు అక్కడకు చేరుకున్నారు. అప్పటికే చంద్రశేఖర్ కూడా ఏమీ తెలియని వాడిలా అక్కడకు చేరుకుని బాధిత కుటుంబసభ్యులతో పాటు తానూ రోదిస్తూ కూర్చొన్నాడు. హత్య జరిగినట్లుగా నిర్ధారించుకున్న పోలీసులు వెంటనే అనంతపురం నుంచి క్లూస్ టీంతో పాటు స్నిప్పర్ డాగ్‌ను రప్పించుకుని రంగంలో దించారు. దాడి జరిగిన ప్రాంతం వద్ద చక్కర్లు కొట్టిన పోలీసు జాగిలం మెలమెల్లగా చంద్రశేఖర్‌ను చుట్టుముట్టింది. అనుమానం వచ్చిన పోలీసులు వెంటనే చంద్రశేఖర్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేయడంతో తానే హతమార్చినట్లు అంగీకరించాడు. హత్యకు పాల్పడిన తీరును వివరించాడు. హతుడి భార్య కృష్ణవేణి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

తొలగింపులన్నీ రాజకీయ కక్ష సాధింపులే

- కలెక్టర్‌కు మాజీ ఎమ్మెల్యే విశ్వ ఫిర్యాదు

ఉరవకొండ: టీడీపీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గి ఎలాంటి నిబంధనలు పాటించకుండా ఉరవకొండ నియోజకవర్గంలో మధ్యాహ్న భోజన ఏజెన్సీ (ఎండీఎం)లు, రేషన్ డీలర్లు, ఫీల్డ్‌అసిస్టెంట్లు, యానిమేటర్లను అధికారులు తొలగిస్తున్నారని, రాజకీయ కక్ష సాధింపుల్లో భాగంగా సాగుతున్న ఈ దురాగతంపై తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలంటూ కలెక్టర్ వినోద్‌కుమార్‌కు మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి విన్నవించారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో శుక్రవారం ఉదయం కలెక్టర్‌ను కలసి వినతిపత్రం అందజేసి, మాట్లాడారు. వజ్రకరూరు మండలం ఛాయపురంలోని ప్రభుత్వ పాఠశాలలో 20 ఏళ్ల గా ఎండీఎం నిర్వహిస్తున్న సుంకమ్మపై టీడీపీ నాయకులు దాడికి ప్రయత్నించడం సిగ్గుచేటన్నారు. దీంతో సుంకమ్మ తీవ్ర మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిందని గుర్తు చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పూర్తి చేసిన రోడ్లు, డ్రైనేజీల పనులకు సంబంధించి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని మంజూరు చేయాలని విన్నవించారు. విశ్వతో పాటు కలెక్టర్‌ను కలసిన వారిలో వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వీరన్న, ఉరవకొండ సర్పంచ్ లలితమ్మ, పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు బసవరాజు ఉన్నారు.

క్లుప్తంగా

ఘనంగా జోడెద్దుల అమావాస్య



ఎద్దుల కొమ్ములకు వైఎస్ జగన్ చిత్రపటాన్ని అలంకరించిన దృశ్యం

విడపనకల్లు: మండలంలోని కరకముక్కల గ్రామంలో శుక్రవారం గ్రామస్తుల ఆధ్వర్యంలో జోడెద్దుల అమావాస్యను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని రైతులు తమ ఎద్దులను అలంకరించి వీధుల్లో ఊరేగించారు. మరికొందరు రైతులు తమ ఎద్దులకు వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ చిత్రపటాలను అలంకరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. రాజకీయాలకు అతీతంగా గ్రామస్తులంతా ఐక్యమత్యంతో వేడుకల్లో పాల్గొన్నారు. ఎంపీటీసీ మల్లికార్జున, సర్పంచ్ రామాంజనరెడ్డి, ఉప సర్పంచ్ ఆదమల్ల, రామురెడ్డి, జగదీష్‌రెడ్డి, తిమ్మారెడ్డి, గోపాల్, వీరారెడ్డి, మహేష్ పర్యవేక్షించారు.

కిరాణా దుకాణం దగ్ధం



దుకాణంలో కాలిపోయిన సరుకులు

మడకశిర: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి ఓ కిరాణా దుకాణం దగ్ధమైంది. వివరాలు... మడకశిరలోని సదాశివపురం ప్రాంతానికి చెందిన నాగలక్ష్మి ఓ చిన్నపాటి కిరాణా దుకాణం ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తోంది. గురువారం రాత్రి వ్యాపార లావాదేవీలు ముగించుకున్న అనంతరం 9 గంటలకు దుకాణానికి తాళం వేసి ఇంటికి వెళ్లిపోయింది. అర్ధరాత్రి 12 గంటల సమయంలో దుకాణం నుంచి పొగలు వస్తుండడం గమనించిన స్థానికులు సమాచారం ఇవ్వడంతో కుటుంబసభ్యులతో కలసి నాగలక్ష్మి అక్కడకు చేరుకుని తలుపులు తీసింది. అప్పటికే మంటల్లో దుకాణంలోని సరుకులు మొత్తం కాలిపోయాయి. దాదాపు రూ.5 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధితురాలు వాపోయింది. విషయం తెలుసుకున్న తహసీల్దార్ వెంకటేష్ శుక్రవారం ఉదయం అక్కడకు చేరుకుని పరిశీలించారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగినట్లు ప్రాథమిక విచారణలో నిర్ధారణ అయింది. మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, పలువురు కౌన్సిలర్లు ఘటనాస్థలాన్ని సందర్శించి, బాధితురాలిని పరామర్శించారు.

'పెంపుడు' జంతువులు.. పొంచి ఉన్న రోగాలు

సందర్భం నేడు ప్రపంచ 'జూనోసిస్‌డే'

అనంతపురం అగ్రికల్చర్: జంతువులతో మనిషికి ఉన్న బంధం ఈనాటిది కాదు. శతాబ్దాలుగా కొనసాగుతూ వస్తోంది. కొందరు పాడికోసం.. ఇంకొందరు వ్యాపారం కోసం... మరికొందరు రక్షణ కోసం... సంతోషం కోసం జంతువులను పెంచుకుంటూ ఉన్నారు. ఇందులో భాగంగా వాటితో సన్నిహితంగా మెలుగుతుంటారు. అయితే ఆయా జంతువుల వల్ల వచ్చే భయంకరమైన వ్యాధుల గురించి మాత్రం చాలామందికి తెలియదంటే అతిశయోక్తి కాదు. ప్రతీ జంతువు నుంచి మనుషులకు బోలెడన్ని వ్యాధులు సంక్రమించే అవకాశం ఉంది. ఈ వ్యాధులపై ప్రజలను చైతన్య పరిచేలా ఏటా జూలై 6న 'ప్రపంచ జూనోసిస్ డే' నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా పెంపుడు జంతువులకు ఉచితంగా టీకాలు వేసి, జూనోటిక్ వ్యాధులపై చైతన్య పరుస్తున్నారు.

జంతుప్రేమ మంచిదే

ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, కుక్కలు, పిల్లులు, పిచ్చుకలు, కుందేళ్లు, పావురాలు లాంటి అన్ని రకాల జంతువులు, పశుపక్షాదులపై ప్రేమ చూపించడం మంచిదే కానీ, అతిగా చేయడం వల్ల అనర్థాలు కూడా పొంచి ఉన్నాయని పశువైద్యాధికారులు అంటున్నారు. పెంపకంలో సరైన జాగ్రత్తలు పాటించకపోతే ప్రాణాంతక వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. జంతువుల నుంచి మనుషులకు, మనుషుల నుంచి జంతువులకు ప్రపంచ వ్యాప్తంగా పరస్పరం 200 వ్యాధులు సంక్రమించే అవకాశం ఉందంటున్నారు. ఇందులో ప్రధానంగా రేబీస్, అంత్రాక్స్, బర్డ్‌ఫ్లూ, స్వైన్‌ఫ్లూ, ఎబోలా, ప్లేగు, టీబీ, బ్రూసెల్లోసిస్, మెదడువాపు లాంటి ప్రాణాంతక, హానికరమైన జబ్బులు కూడా ఉన్నాయన్నారు. పెంపకంలో సరైన జాగ్రత్తలు పాటించకపోవడం, సరైన ఆహార నియమాలు పాటించకపోవడం, క్రమం తప్పకుండా టీకాలు వేయించకపోవడం వల్ల ఈ వ్యాధులు సంక్రమిస్తాయని పేర్కొంటున్నారు. ఈ క్రమంలో శనివారం నిర్వహించే జూనోసిస్ డే సందర్భంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పశువుల ఆస్పత్రుల్లో పెంపుడు, వీధి జంతువులకు ఉచితంగా రోగ నిరోధక టీకాలను వేయనున్నారు. అనంతపురం జిల్లాకు 19,980 డోసులు, శ్రీసత్యసాయి జిల్లాకు 14,280 డోసుల రేబీస్ వ్యాక్సిన్లు అందుబాటులో ఉంచారు.



పలు జంతువుల నుంచి సంక్రమించే వ్యాధులు..

మేకలు	రింగ్‌వార్మ్, లిస్టిరయోసిస్
గుర్రాలు	గ్లాండర్స్, మెదడువాపు, అస్పంల్లోసిస్, క్షయ, బ్రికోల్లా
పందులు	క్షయ, శ్వాసకోశ వ్యాధులు, రేబీస్
కుక్కలు	రేబీస్, బుసెల్లా, ప్లాజీ
ఎలుకలు	ప్లాజీ, లెప్టోస్పైరోసిస్, మెదడువాపు
కోతులు	రేబీస్, మిసిసల్స్
కుందేలు	తలసీమియా, టుటాక్సోప్లాసీమెను
పక్షులు	సిట్టకోకోసిస్, సాల్మోసెల్లోసిస్, అస్పంల్లోసిస్

జాగ్రత్తలు పాటించండి



"జంతువులపట్ల ప్రేమగా ఉండొచ్చు. కానీ, జాగ్రత్తలు పాటించకుండా వ్యవహరించటం ప్రాణాల మీదకు కొనితెచ్చుకోవడమే అవుతుంది. కాబట్టి పెంపుడు జంతువుల విషయంలో జాగ్రత్తలు పాటించండి. జంతువుల నుంచి మనుషులకు... మనుషుల నుంచి జంతువులకు పరస్పరం సంక్రమించే 'జూనోటిక్' వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయడానికి ఏటా జూలై 6న ప్రపంచ వ్యాప్తంగా 'జూనోసిస్‌డే'ను నిర్వహిస్తున్నాం. రాష్ట్ర డైరెక్టరేట్ ఆదేశాల మేరకు ఉచితంగా వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నాం. శనివారం నిర్వహించే ఉచిత టీకాల కార్యక్రమాన్ని జంతు ప్రేమికులందరూ సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం, జేడీ, పశుసంవర్ధక శాఖ, అనంతపురం

భార్య వేధింపులు తాళలేక ఆత్మహత్య

గుంతకల్లు: భార్య వేధింపులు తాళలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. బాధిత కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపిన మేరకు.... పాత గుంతకల్లుకు చెందిన వడ్డె రోహిత్‌కుమార్ (24) బజాజ్ షోరూంలో మెకానిక్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఏడాది క్రితం కర్నూలు జిల్లా ఎమ్మిగనూరుకు చెందిన లక్ష్మీదేవితో ఆయనకు వివాహమైంది. పెళ్లి అయినప్పటి నుంచి భర్తను సూటిపోటి మాటలతో లక్ష్మీదేవి మానసిక క్షోభకు గురి చేస్తూ వచ్చింది. ఈ క్రమంలోనే ఈ ఏడాది జనవరిలో లక్ష్మీదేవి మగ బిడ్డకు జన్మనిచ్చింది. అప్పటి నుంచి ఆమె కాపురానికి రాకుండా పుట్టింట్లోనే ఉండిపోయింది. కాపురానికి రావాలని భర్త పలుమార్లు ప్రాధేయపడ్డాడు. అయితే తాను పెట్టిన కండీషన్లు ఒప్పుకుంటే కాపురానికి వస్తానని ఆ సమయంలో ఆమె చెబుతూ వచ్చింది. విషయం తెలుసుకున్న రోహిత్‌కుమార్ తల్లిదండ్రులు కోడలి కండీషన్ల మేరకు ఆమె పేరుతో కొంత, బాబు పేరుతో మరికొంత స్థలం రాసిచ్చిన తర్వాత కాపురానికి వచ్చింది. ఈ క్రమంలో మూడు నెలల క్రితం బాబు చనిపోయాడు. ఆ తర్వాత భర్తను వదిలి లక్ష్మీదేవి పుట్టింటికి వెళ్లిపోయింది. తన భార్య వేధిస్తున్న విషయంపై ఆరు రోజుల క్రితం గుంతకల్లు రెండో పట్టణ పోలీసులకు రోహిత్ ఫిర్యాదు చేశాడు. దీంతో సీఐ గణేష్ ఇరువురి వాదనలు విన్నారు. తర్వాత పెద్దల సమక్షంలో తామే పంచాయితీ చేసుకుంటామని బాధితులు తెలపడంతో వారిని అక్కడి నుంచి పంపించేశారు. సమస్య మరింత జఠిలం కావడంతో జీవితంపై విరక్తి పెంచుకున్న రోహిత్ గురువారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.



రోహిత్ బంధువులతో మాట్లాడుతున్న పోలీసులు

ప్రభుత్వ ఆస్పత్రి వద్ద ఆందోళన

లక్ష్మీదేవిపై చర్య తీసుకోవడంతో పాటు సీఐ గణేష్ అక్కడకు వచ్చి సమాధానం చెప్పాలంటూ శుక్రవారం ఉదయం ప్రభుత్వ ఆస్పత్రి వద్ద ప్రధాన రహదారిపై రోహిత్ బంధువులు బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... లక్ష్మీదేవి పెట్టిన కండీషన్ల మేరకు 20 సెంట్ల స్థలాన్ని బాబుతో పాటు ఆమె పేరుతో రాసిచ్చినట్లు తెలిపారు. బాబు చనిపోయినప్పుడు లక్ష్మీదేవి ప్రవర్తనపై అనుమానం వచ్చిందన్నారు. ఆ సమయంలో భార్యాభర్తల మధ్య పెద్ద గొడవ జరిగిందని, బాబు చనిపోయిన రాత్రే ఆమె పుట్టింటికి వెళ్లిపోయిందని వివరించారు. అప్పటి నుంచి భర్తకు తరచూ ఫోన్లు చేస్తూ వేధిస్తూ వచ్చిందన్నారు. న్యాయం చేయాలని సీఐ గణేష్‌ను ఆశ్రయిస్తే ఆయన సైతం తమకు వ్యతిరేకంగా మాట్లాడడంతో పాటు రోహిత్‌ను దుర్భాషలాడడంతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నాడని ఆరోపించారు. టూటౌన్ సీఐ గణేష్ అందుబాటులో లేకపోవడంతో వన్‌టౌన్ సీఐ రామసుబ్బయ్య అక్కడకు చేరుకుని బాధితులకు సర్దిచెప్పి ఆందోళన విరమింపజేశారు. మృతుడి తండ్రి క్రిష్టప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

టీడీపీ కార్యకర్తల దాడి

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలోని కల్యాణకట్టలో పనిచేస్తున్న యువకుడు మంగలి రవిపై శుక్రవారం అదే గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు దాడి చేశారు. వివరాలు... రవి తన వాట్సాప్ స్టేటస్‌లో వైఎస్సార్‌సీపీకి సంబంధించిన పోస్టు పెట్టాడు. ఇది నచ్చని టీడీపీకి చెందిన భీమప్ప, సుమన్, విజయ్, మంజునాథ్, రాము తదితరులు శుక్రవారం ఉదయం కల్యాణకట్టకు చేరుకుని రవి బయటకు లాక్కెళ్లి చితకబాదారు. తీవ్రంగా గాయపడిన రవిని స్థానికులు గుంతకల్లు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కసాపురం పోలీసులు విచారణ చేపట్టారు.

యువరైతు బలవన్మరణం



సుధీర్‌కుమార్ (ఫైల్)

పామిడి: జీవితంపై విరక్తితో ఓ యువరైతు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... పెద్దవడుగూరు మండలం పి.కొట్టాలపల్లికి చెందిన సి.చంద్రశేఖర్‌రెడ్డి కుమారుడు సుధీర్‌కుమార్ (30) కొన్నేళ్ల క్రితం బతుకు తెరువు కోసం కువైట్‌కు వెళ్లి తిరిగి వచ్చాడు. ఈ క్రమంలో తల్లి, తమ్ముడు, చెల్లితో కలసి తండ్రికి వ్యవసాయ పనుల్లో చేదోడుగా ఉండేవాడు. ఈ క్రమంలో చెల్లి పెళ్లి, ఎద్దుల కొనుగోలుకు ప్రైవేట్ వ్యక్తుల వద్ద రూ.7 లక్షల వరకు అప్పు చేశాడు. ఇటీవల పంట దిగుబడి లేక పోగా, ఉన్న రెండు ఎద్దులూ చనిపోయాయి. దీంతో జీవితంపై విరక్తి పెంచుకున్న సుధీర్‌కుమార్ శుక్రవారం ఉదయం పాగరూరు సమీపంలోని రైల్వే క్రాస్ వద్దకు చేరుకుని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై గుత్తి జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

తండ్రిపై కత్తితో కుమార్తె దాడి

తాడిపత్రి రూరల్: మండలంలోని ఆలూరులో శుక్రవారం రాత్రి తల్లిని కొడుతున్న తండ్రిపై కుమార్తె కత్తితో దాడి చేసి గాయపరిచింది. పోలీసులు తెలిపిన మేరకు... కుటుంబ కలహాల నేపథ్యంలో భార్య సుభద్రమ్మను భర్త సురేంద్ర తరచూ కొడుతుండేవాడు. ఈ క్రమంలో శుక్రవారం మద్యం మత్తులో ఇంటికి చేరుకున్న సురేంద్ర తన భార్యను కొడుతుండగా కుమార్తె శాంతి అడ్డుకోబోయింది. ఆ సమయంలో కుమార్తెను పక్కకు నెట్టేశాడు. తండ్రిని నిలువరించేందుకు పక్కనే ఉన్న కత్తి తీసుకుని గాలిలో ఊపింది. అదే సమయంలో మత్తులో ఉన్న సురేంద్ర ముందుకు తూలడంతో అతని ముఖానికి గాటు పడింది. గాయపడిన సురేంద్రను వెంటనే తాడిపత్రిలోని ప్రభుత్వాస్పత్రికి కుటుంబసభ్యులు తీసుకెళ్లారు. ఘటనపై విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి : ఎస్టీయూ

అనంతపురం ఎడ్యుకేషన్: ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కొత్త ప్రభుత్వం చొరవ చూపాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రమణారెడ్డి, రామాంజనేయులు డిమాండ్ చేశారు. అనంతపురంలోని ఆ సంఘం కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం జరిగిన ముఖ్యుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలోని ఉద్యోగుల మనోభావాలకు అనుగుణంగా ప్రభుత్వం పనిచేయాలన్నారు. 12వ పీఆర్సీ అమలులో భాగంగా తక్షణమే మధ్యంతర భృతిని ప్రకటించాలన్నారు. పాఠశాల విద్యలో 117 జీఓను రద్దు చేయాలని, ఇంగ్లిష్ మీడియంతో పాటు తెలుగు మాధ్యమాన్ని కూడా కొనసాగించాలన్నారు. 'తల్లికి వందనం' ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మాత్రమే వర్తింప చేయాలన్నారు. ఆగిపోయిన పదోన్నతులను వెంటనే చేపట్టాలన్నారు. పీఎఫ్, జీఎల్ఐసీ లోన్లు, ఫైనల్ సెటిల్‌మెంట్లు, ఆర్జిత సెలవుల బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. సమావేశంలో ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి సూర్యుడు, రాష్ట్ర కార్యదర్శి కె. చంద్రశేఖర్, రాష్ట్ర కౌన్సిలర్ ఫణిభూషణ్, జిల్లా నాయకులు రాజశేఖర్, మురళీకృష్ణ, మల్లికార్జున, రామకృష్ణయ్య, రామకృష్ణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి

బావిలో పడి వివాహిత మృతి

గుడిబండ: ప్రమాదవశాత్తు బావిలో పడి ఓ వివాహిత మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు... గుడిబండ మండలం రామయ్యనహట్టి గ్రామానికి చెందిన క్రిష్టప్ప, మంజుల (26) దంపతులు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. పొలం పనులతో జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం పొలం పనులకు వెళ్లిన ఆమె మధ్యాహ్నం తాగునీటి కోసం వెళ్లి అదుపు తప్పి బావిలో పడింది. ఎంతసేపటికీ ఆమె రాకపోవడంతో తోటి కూలీలు అక్కడకెళ్లి చూశారు. ఒడ్డున చెప్పులు కనిపించడంతో బావిలో పడి ఉంటుందని భావించి గాలింపు చేపట్టి మంజులను వెలికి తీశారు. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను వెంటనే స్థానిక పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు.

పొగపెడుతున్న నకిలీ సిగరెట్లు

- ప్రాణానికి హానికరంగా పొగాకు ఉత్పత్తులు
- చౌక ధరల మాటున పొంచి ఉన్న ప్రమాదం
- నకిలీ సిగరెట్ల దందాపై దృష్టి సారిస్తున్న అధికారులు

అనంతపురం: పొగ తాగడం ఆరోగ్యానికి హానికరం.. ఇది అందరికీ తెలిసిందే.. అయినా పొగ తాగకుండా చాలా మంది ఉండలేరు. వారికి అదొక వ్యసనం. అన్నం లేకున్నా ఉంటారేమో కానీ దమ్ము లాగకుండా ఉండలేని వారు చాలా అరుదుగా కనిపిస్తారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ విషయంపై ఎన్నో ప్రకటనలు వెలువరిస్తున్నాయి. సినిమా థియేటర్లు, టీవీలు, పార్కులు, చివరకు పొగాకు ఉత్పత్తులపై కూడా హానికరమైన ప్రకటన కనిపిస్తూ ఉంటుంది. దీని వల్ల కాన్సర్ వస్తుందని, ఊపిరితిత్తులు పాడైపోతాయని ఎంత చెప్పినా తాగేవారు మాత్రం తాగుతూనే ఉన్నారు. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లాలో నకిలీ సిగరెట్ల విక్రయాలు ఊపందుకున్నాయి.

గుట్టుగా నిషేధిత ఉత్పత్తుల విక్రయాలు

కేంద్రం విధించిన పన్ను భారంతో బ్రాండెడ్ సిగరెట్ల ఖరీదైపోవడంతో ఉమ్మడి జిల్లాలో నకిలీ సిగరెట్లు హల్‌చల్ చేస్తున్నాయి. నిజానికి ధూమపానం అనేదే ఆరోగ్యానికి హానికరం. సిగరెట్ అలవాటు మంచి కాదంటారు డాక్టర్లు. ఈ అలవాటుతో క్రమంగా ఆరోగ్యం దెబ్బతింటుందని హెచ్చరిస్తున్నారు. అలాంటిది నకిలీ సిగరెట్లు మరింత హానికరమో ఆలోచించాలంటున్నారు. కొందరు కేటుగాళ్లు నకిలీ సిగరెట్లు తయారు చేసి వాటికి బ్రాండెడ్ కంపెనీ లేబుల్స్ అతికించి గుట్టు చప్పుడు కాకుండా మార్కెట్లో విక్రయిస్తున్నారు. ఇలాంటి సిగరెట్లు కాల్చడం వల్ల తర్వగా ఆరోగ్యం పాడవుతుందని డాక్టర్లు చెబుతున్నారు. కేవలం నకిలీ సిగరెట్లే కాదు... చివరకు పొగాకు నిషేధిత ఉత్పత్తులైన గుట్కా, ఖైనీ తదితరాల విక్రయాలు సైతం జిల్లాలో గుట్టుగా సాగుతోంది. రూ.2 విలువైన పొగాకు ఉత్పత్తులను ఏకంగా రూ.10తో విక్రయిస్తూ వ్యసనపరుల జేబులు, ఆరోగ్యాలు గుల్ల చేసేస్తున్నారు.



ఇటీవల పట్టుబడిన నకిలీ సిగరెట్లు

పట్టుబడుతున్న రూ.లక్షల విలువైన సరుకు

ఈ నెల 3న అనంతపురం వన్‌టౌన్ పోలీసులు, సెబ్ అధికారులు సంయుక్తంగా చేపట్టిన తనిఖీల్లో ఏకంగా రూ.10.40 లక్షల విలువైన నకిలీ సిగరెట్లు పట్టుబడ్డాయి. గత ఏడాది సైతం జీఎస్టీ అధికారులు చేపట్టిన తనిఖీల్లో ఓ లారీలో అక్రమంగా తరలిస్తున్న రూ.కోట్ల విలువైన నకిలీ సిగరెట్లు పట్టుపడ్డాయి. ఈ క్రమంలో జిల్లా వ్యాప్తంగా విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నిఘాను మరింత విస్తృతం చేశారు. జిల్లాలో సిగరెట్ల పరంగా హోల్‌సేల్ వ్యాపారుల జాబితాను సేకరించి ఆకస్మిక తనిఖీలకు కార్యాచరణ రూపొందించారు.

పన్నుల ఎగవేతతో భారీగా లబ్ధి

సాధారణంగా బ్రాండెడ్ సిగరెట్లను ఐటీసీ తదితర కంపెనీలు అధికారికంగా హోల్‌సేల్ వ్యాపారులకు సరఫరా చేస్తూ ఉంటాయి. అయితే నకిలీ సిగరెట్లు బంగ్లాదేశ్, చైనా తదితర విదేశాల నుంచి అక్రమంగా రవాణా అవుతున్నట్లు పోలీసులు నిర్ధారించారు. ప్రభుత్వానికి ఎలాంటి పన్ను చెల్లించకుండా అతి చౌక ధరతో వీటిని కేటుగాళ్లు అక్రమంగా దిగుమతి చేసుకుంటూ ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నారు. బ్రాండెడ్ కంపెనీల సిగరెట్ రూ.10 నుంచి రూ.15 వరకు ఉంటే అదే నకిలీ సిగరెట్ రూ.2 నుంచి రూ.5 వరకు ఉంటోంది. ఈ నకిలీ సిగరెట్ల క్రయవిక్రయాలకు సంబంధించి వ్యాపారులు ఎలాంటి రికార్డులు నిర్వహించడం లేదని తనిఖీల్లో జీఎస్టీ అధికారులు గుర్తించారు. ఈ లెక్కన నకిలీ సిగరెట్ల వ్యాపారంలో ప్రభుత్వ ఖజానాకు భారీగా గండిపడుతుండడంతో రెవెన్యూ, లీగల్ మెట్రాలజీ, కమర్షియల్ అధికారులు ఏకతాటిపైకి వచ్చారు. అందరూ సమన్వయంతో ఆకస్మిక తనిఖీలు చేపట్టి నకిలీ సిగరెట్లు, నిషేధిత పొగాకు ఉత్పత్తుల విక్రయాలను అరికట్టే దిశగా కార్యాచరణను రూపొందించి, ఆ దిశగా అడుగేస్తున్నారు.

పోక్సో కేసులో వ్యక్తికి రిమాండ్

కుందుర్పి: ప్రార్థనల పేరుతో నమ్మించి బాలికను విజయవాడకు తరలించిన బ్రహ్మసముద్రం మండలం చెలిమేపల్లికి చెందిన పాస్టర్ కొల్లప్ప అలియాస్ మాణిక్యరాజుపై పోక్సో కేసు నమోదు చేసి, శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ వెంకటస్వామి తెలిపారు. కళ్యాణదుర్గం నియోజకవర్గం లోని వివిధ గ్రామాల్లో కొల్లప్ప తననుతాను పాస్టర్‌గా పరిచయం చేసుకుని ప్రార్థనలతో స్వాంతన కల్గిస్తానని మహిళలను మోసగించి బంగారు ఆభరణాలు, విలువైన వస్తువులు అపహరించుకెళ్లినట్లు ఫిర్యాదులు ఉన్నాయన్నారు. ఈ క్రమంలోనే కుందుర్పికి చెందిన ఓ బాలికను ప్రార్థనల పేరుతో విజయవాడకు తరలించాడన్నారు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, విచారణ అనంతరం కొల్లప్పపై పోక్సో కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

GNM (నర్సింగ్) అడ్మిషన్స్

On-Line అప్లికేషన్స్ స్టార్ట్. ఇంటర్ ఎనీ గ్రూప్ పాస్ స్టూడెంట్స్ కి GNM (నర్సింగ్) కోర్స్ నందు గవర్నమెంట్ సీట్స్ కలవు. ఫ్రీ ఎడ్యుకేషన్ + ఫ్రీ హాస్టల్ కలదు. సంప్ర : ఎ.మురళి, 9030661651 అనంతపురం. [A-1271]

DISTANCE EDUCATION

ఆంధ్ర మరియు నాగార్జున యూనివర్సిటీ దూరవిద్యలో B.A., B.Com., B.Sc., మరియు M.A., M.Com., M.Sc, MHRM, MSW, B.Li.Sc, M.Li.Sc. మరియు Diploma Course లలో అన్ని గ్రూపులకు 2024 సం॥ అడ్మిషన్లు జరుగుచున్నవి. రఘువీరా టవర్స్ వెనుక, వస్త్ర షోరూమ్ సెల్లార్‌లో, అనంతపురము. సెల్ : 8333085320. [A-7017]

COACHING CENTER

TET+DSC-SGT & SA Mega Free Demo On July 7th @ 9am. అత్యంత అనుభవజ్ఞులైన అధ్యాపకులచే క్లాసులు నిర్వహిస్తున్న సంస్థ. అకాడమీని స్థాపించి 10సం॥ పూర్తీ చేసుకొన్న సందర్భంగా మొదటి 50 మంది అభ్యర్థులకు ఫీజులో 50% రాయితీ ఇవ్వబడును. అనంత భవిత అకాడమీ, సప్తగిరి సర్కిల్, అనంతపురము. 7997592299. [A-7021]

EDUCATION

B.Sc, P.B.B.Sc, GNM, DMLT, DOA, DRGA, DIALYSIS, DMST అడ్మిషన్లు జరుగుతున్నవి. సీట్లు పరిమితం, స్కాలర్‌షిప్ సౌకర్యం కలదు. వివరాలకై సంప్రదించండి Aayushman Group Of Institutions. సెల్: 98495 65780. [L-800672]

REAL ESTATE

HOSTEL FOR SALE

ATP, కమలానగర్ నందు మంచి రన్నింగ్ తో ఉన్న స్టడీ హాల్ & బాయ్స్ హాస్టల్ అమ్మబడును. కావలసినవారు సంప్ర : 8885532257 [A-186]

PLOT FOR SALE

Plot.No.39 (8.84 Cents), Near Goutami Villas, Saptagiri Colony, Kakkalapalli Village, Anantapur for sale. Contact No.9966778780, 6304367885. [A-1274]

SERVICES

CHANGE OF NAME

I, BADARI NARAYANA MURTHY (Old Name) R/o 21-225, Bramhin Street, Old Town, Anantapur (T&D), A.P. I Changed my name from BADARI NARAYANA MURTHY (Old Name) to GARAKAPATI BADARI NARAYANA MURTHY (New Name). Henceforth my known as GARAKAPATI BADARI NARAYANA MURTHY, S/o GARAKAPATI LAKSHMINARAYANA for all purposes. [A-1273]

WANTED

ట్రాక్టరు డ్రైవర్ కావలెను. అనంతపురం, గార్లదిన్నె : బత్తాయి తోటలో మినీ ట్రాక్టర్‌తో టిల్లర్ పని, నీరు పెట్టడం. రూము, కరెంటు, భోజన వసతి + జీతం: 16వేలు, 9652350677 [A-188]

మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9948666206,9573633520. [M-1185254]

ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సప్ చేయగలరు. 95026 15217 [M-1185241]

హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీ : 18K సంప్ర : 9640258899, 9640468899 [H-796175]

PCMR EM School, (Nagaluru), Dharmavaram. Wanted Teachers to Teach 6th to 10th Classes. Subjects English, Social & Hand Writing. Contact : 9885386684, 9505292219. [A-762319]

దండపాని రియల్‌ఎస్టేట్ సంస్థ నందు పనిచేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ఫిక్స్ శాలరీ 10,000 నో టార్గెట్ అనుభవం కలవారికి ప్రాధాన్యత ప్లాట్ నెంబర్ 204, లోటస్ గ్రాండ్, రాంనగర్ అనంతపురం.Contact: 6300725354. [A-189]

కావలెను. ఎలక్ట్రిసిటీ మీటర్లకు డోర్ టు డోర్ సర్వే చేయుటకు, కస్టమర్ డేటా ఎంటర్ చేయుటకు 18-35 సం॥. వయస్సు గల స్త్రీ/పురుషులు కావలెను. అర్హత : 10th & above ఇంగ్లీష్ వ్రాయడం, చదవడం అవసరం. # జెప్టిక్ కన్‌స్ట్రక్షన్ ప్రైవేట్ లిమిటెడ్. సెల్ : 9014981414, 9059451164. [A-187]

ప్రకటన గోరంత ! స్పందన కొండంత !!

4 లైన్లు రూ: 270/-

అదనపు లైను రూ: 60/-

ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం

ANANTHAPURAMU : 9010567770, 9492288307, 9010588846, 9243295650

DHARMAVARAM : 9912220726, 9912220727

HINDUPUR : 9912220723, 9705346587

GUNTAKAL : 9010223701

TADIPATRI : 9912220722

MADAKASIRA : 9010200238

KADIRI : 9010593486

RAYADURG : 9010470185

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్లుప్తంగా

ఆర్గానిక్ కూరగాయలతో ఆరోగ్యం



రైతుబజార్‌లో ఏర్పాటు చేసిన ఆర్గానిక్ కూరగాయల కౌంటర్

అనంతపురం అగ్రికల్చర్: ప్రకృతి వ్యవసాయ విభాగం (జెడ్‌బీఎన్‌ఎఫ్) ఆధ్వర్యంలో ప్రకృతి సిద్ధంగా పండించిన కూరగాయల విక్రయ కేంద్రాన్ని స్థానిక రైతుబజార్‌లో ఏర్పాటు చేశారు. కూడేరు మండలానికి చెందిన సిద్ధలింగప్ప అనే రైతు తన పొలంలో పూర్తిగా ఆర్గానిక్ పద్ధతిలో పండించిన అన్ని రకాల కూరగాయలను అందుబాటులో ఉంచారు. ఎక్కడా ఎలాంటి రసాయన, పురుగు మందులు వాడకుండా పూర్తిగా ఘన జీవామృతం బీజామృతం తదితర గో సంబంధిత ఎరువులు, కషాయాలు వాడుతున్నట్లు రైతు తెలిపారు. ఆహారపరంగా, ఆరోగ్య పరంగా ఆర్గానిక్ కూరగాయలు చాలా మంచివి.. నగర వాసులు సద్వినియోగం చేసుకోవాలని జెడ్‌బీఎన్‌ఎఫ్ అధికారులు సూచించారు.

వైఎస్సార్ విగ్రహానికి రంగులు



ఆత్మకూరు: ఈనెల 8వ తేదీన డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతిని ఘనంగా నిర్వహించాలని వైఎస్సార్ సీపీ ఆదేశాలు జారీ చేసింది. శుక్రవారం మండల కేంద్రంలో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి స్థానిక నాయకులు రంగులు వేయించి ముస్తాబు చేశారు. ప్రతి గ్రామంలో వైఎస్సార్ జయంతిని ఘనంగా నిర్వహించేందుకు వైఎస్సార్‌సీపీ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

యువకుడికి తీవ్ర గాయాలు



చికిత్స పొందుతున్న మల్లేశ్

రాప్తాడు రూరల్: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. అనంతపురం రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఆత్మకూరు మండలం పి.కొత్తపల్లి గ్రామానికి చెందిన మల్లేశ్ అనంతపురం నగరంలో మెడికల్ రెప్‌గా పని చేస్తున్నాడు. గురువారం రాత్రి విధులు ముగించుకుని స్వగ్రామం పి.కొత్తపల్లికి తన ద్విచక్ర వాహనంలో బయలుదేరాడు. మార్గం మధ్యలో కురుగుంట వద్దకు వెళ్లగానే ముందు వెళ్తున్న మరో ద్విచక్ర వాహనం ఉన్న ఫలంగా కుడివైపుకు తిరిగింది. దీంతో వెనుకే వస్తున్న మల్లేశ్ అదుపు తప్పి బైకును ఢీ కొట్టి కిందపడ్డాడు. ప్రమాదంలో తలకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే అనంతపురం సర్వజన ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం బెంగుళూరుకు తరలించారు. ఈ ఘటన పై శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు.

వేరుశనగ పంట పరిశీలన



మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ అధికారులు

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం చియ్యేడు వద్ద రైతు లింగమయ్య సాగు చేసిన వేరుశనగ, కంది పంటలను వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి అనంతపురం డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకుడు ఎం.రవి శుక్రవారం పరిశీలించారు. పంటల సాగులో ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఎక్కువ విస్తీర్ణంలో కంది సాగు చేశామని.. మద్దతు ధర ఎక్కువ వచ్చేలా చూడాలని రైతులు కోరారు. అలాగే రబీలో మంచి వంగడాలను ప్రభుత్వం ద్వారా సరఫరా చేస్తామని ఏడీ తెలియజేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిణి శశికళ, వ్యవసాయ విస్తరణ అధికారి మురళి, మురళీకృష్ణ, ఆర్బీకే అసిస్టెంట్ భువనేశ్వరి పాల్గొన్నారు.

అనంతకు చేరుకున్న సైకిల్ యాత్రికుడు

అనంతపురం కల్చరల్: దేశ సమైక్యత, ఆధ్యాత్మిక భావజాల విశిష్టతను చాటుతూ దేశంలోని ప్రధాన పుణ్యక్షేత్రాల సందర్శనకు సైకిల్ యాత్ర చేస్తున్న కర్ణాటక వాసి పాటిల్ ప్రదీప్ శుక్రవారం అనంతకు చేరుకున్నారు. ఈ సందర్భంగా పలువురు ఆధ్యాత్మిక సంఘాల ప్రతినిధులు ప్రదీప్‌కు ఘనంగా స్వాగతం పలికారు. సీనియర్ న్యాయవాది హోసూరు రామసుబ్రహ్మణ్యం, కేవీఎస్ చలపతి రెడ్డి, హట్టి కేదార్‌నాథ్ తదితరులు మాట్లాడుతూ.. బెంగళూరు నుంచి అనంత మీదుగా అయోధ్య, కేదార్‌నాథ్, బద్రీనాథ్ పుణ్యక్షేత్రాల దర్శనానికి ప్రదీప్ చేస్తున్న సైకిల్ యాత్ర విజయవంతమై అందరిలో స్ఫూర్తి నింపాలని ఆకాంక్షించారు. అంతకు ముందు మొదటి రోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో ప్రత్యేక పూజల అనంతరం సైకిల్ యాత్రికుడికి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో సత్యనారాయణ, వెంకటేష్, మురళి, తెలకపల్లి శ్రీనివాసశర్మ, కరణం చంద్రశేఖరరావు పాల్గొన్నారు.



కస్తూర్బా పాఠశాల లోపల చెట్టుపై ఉన్న కోతులు



పాఠశాల వరండాలో కోతుల సంచారం

వామ్మో.. వానరాలు

ఆత్మకూరులోని కస్తూర్బా పాఠశాలలో రోజు రోజుకు కోతుల బెడద అధికం అవుతోంది. కోతులు ఏకంగా పాఠశాలలోని తరగతి గదుల్లోకి ప్రవేశిస్తుండటంతో సిబ్బంది, విద్యార్థినులు భయాందోళనకు గురవుతున్నారు. అంతేకాక పాఠశాలలోని చెట్లు, ఆవరణ, వంట గది కాంపౌండ్‌పై కూర్చుని దొరికిన వస్తువులను ధ్వంసం చేస్తున్నాయి. విద్యార్థినులను పలకరించేందుకు వస్తున్న తల్లిదండ్రులపై దాడికి యత్నిస్తున్నాయి. ముఖ్యంగా పాఠశాల ఆరు బయట ఉన్న వస్తువులు, వైర్లు, మొక్కలను నాశనం చేస్తున్నాయి. ఎక్కడ దాడి చేసి, గాయపరుస్తాయో అని విద్యార్థినులు భయపడుతున్నారు. అధికారులు స్పందించి కోతులను దూరంగా తరలించాలని మండల ప్రజలు, విద్యార్థినులు కోరుతున్నారు.

– ఆత్మకూరు:



వంట గది వద్ద కాంపౌండ్‌పై కూర్చొన్న వానరం

ప్రపంచ స్థాయిలో పోటీ పడాలి

అనంతపురం ఎడ్యుకేషన్: శాస్త్ర సాంకేతిక రంగాల్లో మన విద్యార్థులు ప్రపంచ స్థాయిలో పోటీ పడాలని నగరపాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్ సూచించారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఐటీఐలో టాటా స్ట్రైవ్, సీమెన్స్, డ్యూయల్ వీఈటీ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం 'స్కిల్ కాంపిటీషన్' పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మేఘా స్వరూప్ ఈ పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి చెందుతున్న అనేక రంగాల్లో మనకు ఇష్టమైన రంగాన్ని ఎంపిక చేసుకుని రాణించాలన్నారు. విద్యార్థి దశ నుంచే విశ్లేషణాత్మక దృష్టితో ముందుకెళ్లాలని సూచించారు. ఐటీఐల్లో విద్యార్థులు మరిన్ని మెలకువలు నేర్చుకుని బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ఆకాక్షించారు. ఐఎంసీ సభ్యుడు శేషాంజనేయులు మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలన్నారు. ఐటీఐ ప్రిన్సిపాల్ రామమూర్తి మాట్లాడుతూ.. స్కిల్ కాంపిటీషన్‌లో మొత్తం 38 ప్రాజెక్టులను ప్రదర్శించడం జరిగిందన్నారు. జోన్-4 పరిధిలోని ప్రభుత్వ ఐటీఐ విద్యార్థులు రూపొందించిన నమూనాలను పరిశీలించిన డీవీఈఓ వెంకటరమణ నాయక్ విజేతలను ఎంపిక చేశారు.



పోటీలను ప్రారంభిస్తున్న నగరపాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్

విజేతలు వీరే..

ప్రభుత్వ బాలుర ఐటీఐ (అనంతపురం) విద్యార్థులు రూపొందించిన 'ఆటోమేటిక్ బ్రేకింగ్ సిస్టమ్', ప్రభుత్వ బాలికల ఐటీఐ (అనంతపురం) విద్యార్థినులు రూపొందించిన 'ఆల్కహాల్ డిటెక్షన్ సెన్సార్' ప్రాజెక్ట్ ప్రథమ స్థానం, సాయి వెంకటేశ్వర ఐటీఐ విద్యార్థులు రూపొందించిన 'ఆటోమేటిక్ స్ట్రీట్ లైటింగ్ సిస్టమ్' ప్రాజెక్ట్ ద్వితీయ స్థానం, ప్రభుత్వ ఐటీఐ గుంతకల్లు విద్యార్థులు రూపొందించిన 'గ్రీన్ హైడ్రోజన్ వెహికల్' మూడో స్థానంలో నిలిచాయి.

ఆస్తి కాజేసేందుకు టీడీపీ నాయకుల ప్రయత్నం

అనంతపురం రూరల్: తాతల కాలం నాటి ఆస్తిని కాజేసేందుకు ప్రయత్నిస్తున్న టీడీపీ నేతలపై కఠిన చర్యలు తీసుకోవాలని గుగ్గిళ్ల రాఘవరెడ్డి కుటుంబ సభ్యులు అధికారులను కోరారు. శుక్రవారం అనంతపురం రూరల్ పరిధిలోని రుద్రంపేట పంచాయతీ వికలాంగుల కాలనీ కక్కలపల్లి పొలం సర్వే నంబర్ 99-1లోని ఆస్తిని టీడీపీ నేతలు కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తుండగా బాధిత కుటంబ సభ్యులు మీడియా, పోలీసులను ఆశ్రయించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యుడు రాఘవరెడ్డి మీడియాతో మాట్లాడారు. రుద్రంపేట పంచాయతీ వికలాంగుల కాలనీ సమీపంలో కక్కలపల్లి పొలం సర్వే నంబర్ 99-1లో మా తాత గుగ్గిళ్ల నాగిరెడ్డి, అవ్వ కామాక్షమ్మ పేర్లపై 28.85 ఎకరాల భూమికి 1993 నుంచి అన్ని హక్కులు ఉన్నాయన్నారు. 28.85 ఎకరాల్లో 21.30 ఎకరాల భూమిని పూర్వీకులు విక్రయించడం జరిగిందన్నారు. మిగిలిన 7.12 ఎకరాల భూమి తమ ఆధీనంలో ఉందని తెలిపారు. వారసత్వంగా వస్తున్న భూమిని కొంతమంది దుర్మార్గులు రెవెన్యూ అధికారులను అడ్డంగా పెట్టుకుని కాజేయాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాతల నుంచి సంక్రమించిన భూమిపై తమకు అన్ని హక్కులు ఉన్నాయని పేర్కొన్నారు. అయితే టీడీపీ నాయకులు అధికారులను అడ్డం పెట్టుకుని రెవెన్యూ రికార్డుల్లో తమ పేర్లను తొలగించి వారి పేర్లను ఎక్కించుకున్నారని మండిపడ్డారు. టీడీపీ నాయకులు తమపై దౌర్జన్యం చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని వాపోయాడు. 1975లో ల్యాండ్‌సీలింగ్ యాక్ట్ కమిటీ సైతం ఆ భూమి తమకే చెల్లుతుందని నివేదిక ఇచ్చినప్పటికీ పోలీసు, రెవెన్యూ అధికారులు టీడీపీ నాయకులకే వత్తాసు పలకడం దుర్మార్గమన్నారు. భూమికి సంబంధించిన రికార్డులను ఇటీవల జిల్లా కలెక్టర్‌కు అందజేసి న్యాయం చేయాలని కోరామన్నారు. అయినా తమకు న్యాయం జరగలేదని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.



మాట్లాడుతున్న గుగ్గిళ్ల రాఘవరెడ్డి

'ఆషాఢం' వచ్చేసింది..

అనంతపురం కల్చరల్: శూన్యమాసంగా భావించే ఆషాఢ మాసంలో చాలా మంది వివాహాది శుభకార్యాలకు దూరంగా ఉంటారు. శాస్త్రీయ కారాణాలు అనేకం ఉండటం వల్ల దీనిని శూన్యమాసం అంటారు. వాస్తవానికి ఈ మాసంలో పవిత్రంగా భావించే పర్వదినాలు ఎన్నో కనపడతాయి. శుక్రవారం వచ్చి గాండ్ల అమావాస్యతో జ్యేష్ఠమాసం వెళ్లిపోయి శనివారం నుంచి ఆషాఢం ప్రారంభమవుతుంది. ఆగస్టు 4 వరకూ ఉండే ఆషాఢం ఆచార వ్యవహారాలను, అమ్మవారి ఆరాధన ప్రాముఖ్యతను తెలియజేస్తుంది.



అలంకరణలో ముత్యాలమ్మ తల్లి

జ్ఞానమార్గం చూపే ఆచారాలు

ఆషాఢ శుద్ధ ఏకాదశి విష్ణుఆరాధనకు అత్యంత ముఖ్యమైన తిథిగా అందరూ భావిస్తారు. దీనికే తొలి ఏకాదశి అని పేరు. అలాగే వారానికి ఒక వ్రతం లేదా పండుగ చొప్పున పలకరించి పోతుంటాయి. దక్షిణాయనం ప్రారంభమయ్యే ఈ ఆషాఢంలోని తొలి ఏకాదశి నుంచి చాతుర్మాస్య వ్రతంగా జరుపుకుంటారు. వాతావరణంలో వచ్చే మార్పుల వల్ల కొన్ని నియమాలతో కొన్ని దినుసులు వాడకపోవడం ఈ వ్రతం ప్రత్యేకత. అలాగే వేడిని తగ్గించే గోరింటాకు పెట్టుకోవడం అత్యంత శుభప్రదమని ఆయుర్వేద శాస్త్రం చెపుతుంది. ఇక ప్రత్యేకించి అజ్ఞానాంధకారాన్ని తొలగిస్తూ జ్ఞానజ్యోతులను ప్రసాదించే గురు పౌర్ణిమ ఇదే నెలలో 21న వచ్చి వేదవ్యాసుల వంటి సద్గురువుల ప్రాముఖ్యత తెలియజేస్తుంది. గ్రామ దేవతలకు సమర్పించే బోనాల జాతరలు ఈ మాసంలో అధికంగా వస్తాయి. ముఖ్యంగా శాకంబరీ నవరాత్రులు నగరంలోని దత్తాత్రేయ విరూపాక్ష మఠంలో ఈనెల 6 నుంచి 14 వరకు కనుల పండువగా జరగనున్నాయి. వాడవాడలా సప్తమాతృకలు, మహిషాసుర మర్దిని, దుర్గాదేవి, భైరవ, వరాహ, నారసింహుల ఆరాధన అధికంగా ఆషాఢంలోనే సాగుతుంది. కొత్తగా పెళ్లయిన దంపతులు నెలరోజుల పాటూ శాస్త్రీయ కారణాలతో దూరంగా ఉండే రోజులు కూడా ఆషాఢంలోనే కనిపిస్తాయి. ఇలా సంప్రదాయ ఆచార వ్యవహారాలతో జ్ఞాన మార్గంలో సాగే మాసంలోనే ఇస్కాన్ వారి ఆధ్వర్యంలో రాష్ట్రంలోనే అత్యంత ఘనంగా సాగే పూరి జగన్నాథుడి రథయాత్ర ఈనెల 13, 14 తేదీల్లో జరుగుతుండటం విశేషం.

వారాహి నవరాత్రుల్లో పాల్గొనండి

మాసాల్లో ఆషాఢానికి విశేష ప్రాముఖ్యం ఉంది. ముఖ్యంగా అమ్మవారి ఆరాధన ఎంతో ఉన్నతులను చేస్తుంది. నగరంలోని సిండికేట్ నగర్ జగద్గురు శంకర దత్తాత్రేయ మహాసంస్థానం శృంగేరి విరూపాక్ష మఠంలో తొమ్మిది రోజుల పాటూ 'వారాహి నవరాత్రుల' వేడుకలు ఎంతో వైభవంగా జరుగుతాయి. నిత్యం సాయంత్రం అమ్మవారికి శ్రీ చక్రార్చన, ఆవరణ పూజలు, చివరి రోజు మహా వారాహి హోమం జరుగుతాయి. భక్తులు అమ్మవారి సేవలో పాల్గొనాలి.

– విద్యానృసింహభారతి, పీఠాధిపతి

రేపు వాల్మీకి ప్రజాప్రతినిధులకు సన్మానం

అనంతపురం రూరల్: వాల్మీకి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఈనెల 7న వాల్మీకి ప్రజాప్రతినిధులను సన్మానించనున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గంగాధర్ తెలిపారు. శుక్రవారం వాల్మీకి కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వాల్మీకి ప్రజా ప్రతినిధులందరినీ ఒకే వేదికపైకి తీసుకొచ్చి ఘనంగా సన్మానించాలన్న ఉద్దేశంతో ఈనెల 7న రుద్రంపేట సమీపంలో ఉన్న వాల్మీకి కళ్యాణ మండపంలో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశామన్నారు. వాల్మీకులు రాజకీయాలకు అతీతంగా ఐక్యంగా ఉంటేనే రాజకీయంగా, ఆర్థికంగా ఎదుగుతామన్నారు. ఆత్మీయ సన్మాన కార్యక్రమానికి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వాల్మీకి ఎంపీ, ఎమ్మెల్యేలతో పాటు ఇతర ప్రజాప్రతినిధులను ఆహ్వానించినట్లు పేర్కొన్నారు. వాల్మీకులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో వాల్మీకి ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నారాయణ స్వామి, కోశాధికారి కిశోర్ కుమార్, ఉపాధ్యక్షుడు కృష్ణమూర్తి, సీనియర్ నాయకులు సూర్య నారాయణ, భాస్కర్ నాయుడు, రమణ, సూర్యనారాయణ, నరసింహులు, చంద్రన్న తదితరులు పాల్గొన్నారు.


బహుముఖ ప్రజ్ఞాశాలి 'రావూరి భరద్వాజ'



రావూరి భరద్వాజ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అనంత సాహితీవేత్తలు

అనంతపురం కల్చరల్: స్థానిక విశాలాంధ్ర బుక్ హౌస్‌లో శుక్రవారం బహుముఖ ప్రజ్ఞాశాలి, జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత రావూరి భరద్వాజ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. జాషువా సాహిత్యపీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు సాహితీవేత్తలు, కవులు, రచయితలు రావూరి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిరుపేద కుటుంబంలో పుట్టి దేశ అత్యున్నత సాహితీ పురస్కారం పొందిన గొప్ప సాహితీవేత్త రావూరి భరద్వాజ అని కొనియాడారు. కేవలం ప్రాథమిక పాఠశాల చదువు మాత్రమే చదువుకున్న ఆయన తన జీవిత కాలంలో 37 కథా సంకలనాలు, 17 నవలలు, 6 బాలల నవలలు, 8 నాటకాలు రచించి ఆదర్శంగా నిలిచారన్నారు. ఆయన రాసిన పాకుడు రాళ్లు గొప్ప గ్రంథమని అందరూ చదివి తీరాల్సిన సాహిత్యమని తెలిపారు. చాలా యూనివర్శిటీలు ఆయనకు గౌరవ డాక్టరేట్లు అందజేశాయని గుర్తు చేసుకున్నారు. అంతకు ముందు రావూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సాహిత్యపీఠం ప్రధాన కార్యదర్శి నాగలింగయ్య, అశ్వర్థరెడ్డి, నాగేంద్ర, ఈరన్న, హరీష్, ప్రవీణ్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లు మంజూరు చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయీ బ్రహ్మణులు

రాప్తాడు: నిరుపేదలమైన తమకు ఇళ్లు మంజూరు చేయాలని నాయీ బ్రహ్మణులు కోరారు. శుక్రవారం తహసీల్దార్ సీతారామ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. మండలంలోని పలు గ్రామాల నాయీ బ్రహ్మణులకు గతంలో రాప్తాడు పొలంలో సర్వే నంబర్ 117, 118లో ఇళ్ల పట్టాలు మంజూరు చేయడం జరిగిందని శివప్రసాద్, శ్రీనివాసులు, ప్రసాద్, ఆంజనేయులు, రమేష్, శివకుమార్ తదితరులు తెలిపారు. సదరు స్థలాల్లో ఇళ్లు మంజూరు చేయాలని విన్నవించారు. మరికొంత మంది పునాదులు నిర్మించుకున్నట్లు పేర్కొన్నారు. పలువురు ఇళ్లు కట్టుకునేందుకు స్థోమత లేక నిర్మించుకోలేదని వివరించారు. కొందరు వ్యక్తులు గునాదులను ఫొటో తీసుకుని వాటిని రద్దు చేయిస్తామంటూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్లు కట్టుకునేందుకు ప్రభుత్వం సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పలువురు నాయీ బ్రహ్మణులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి



ఇందిరాగాంధీ నగరపాలక పాఠశాలలో మొక్క నాటుతున్న మేయర్ వసీం



చిన్మయనగర్‌లో మొక్క నాటుతున్న ఎంపీడీఓ గీతావాణి

అనంతపురం కార్పొరేషన్: మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించాలి. మొక్కల పెంపకం సామాజిక బాధ్యత అని మేయర్ వసీం పేర్కొన్నారు. శుక్రవారం ఆర్కేనగర్‌లో ఉన్న ఇందిరా గాంధీ నగరపాలక పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మేయర్ వసీం మొక్కలు నాటిన అనంతరం మాట్లాడారు. రాబోయే తరాలు ఆరోగ్యంగా ఉండాలంటే మొక్కల పెంపకాన్ని విరివిగా చేపట్టాలన్నారు. పరిసరాల పచ్చదనంతో ప్రజల జీవనం ఆరోగ్యకరంగా, ఆనందకరంగా ఉంటుందని తెలిపారు. విద్యార్థులు కూడా మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలన్నారు. అధ్యాపకులు మొక్కల ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, ఏసీపీ మారుతిహరిప్రసాద్, ఈఈ సూర్యనారాయణ, డీఈ రవీంద్ర రెడ్డి, నాయకులు శీన, రామచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

రాప్తాడు: పచ్చదనాన్ని పెంపొందించడంతో పాటు కాలుష్యాన్ని నివారించి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి. మొక్కలు నాటి పచ్చదనాన్ని పరిరక్షించాల్సిన బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకోవాలని ఎంపీడీఓ గీతావాణి అన్నారు. శుక్రవారం మండలంలోని చిన్మయనగర్ రైల్వే బ్రిడ్జి సమీపంలో రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. చెట్లను విచ్చల విడిగా నరికి వేయడం వల్ల కాలుష్యం పెరిగిపోయిందన్నారు. జీవకోటి మనుగడ ప్రశ్నార్థకమవుతోందన్నారు. మొక్కలను విరివిగా నాటి ప్రతి గ్రామాన్ని ఒక ఉద్యానవనంగా మార్చాలని సూచించారు. మొక్కలు నాటి పెంచడం అనేది ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. విలువైన మొక్కలను పరిరక్షించుకోకపోతే మానవ మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. సృష్టిలోని జీవరాశులన్నింటికీ మొక్కలు ఆధారమన్నారు. అడవులను నరికి వేయడం వల్ల ఇప్పటికే ఎన్నో రకాల అరుదైన మొక్కలు అంతరించిపోయాయని గుర్తు చేశారు. అనంతరం మొక్కలను సంరక్షించాలంటూ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఏపీఓ సావిత్రి, సర్పంచ్ శశికళ, ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.

అనంత మ్యూజియం అభివృద్ధికి కృషి

అనంతపురం కల్చరల్: అనంతలో సర్వాంగ సుందరంగా నిర్మించిన మ్యూజియం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఐఆర్ఎస్ అధికారి, ఎలక్షన్ అబ్జర్వర్ విలాస్ పాండే అన్నారు. శుక్రవారం ఆయన జిల్లా కేంద్రంలోని పురావస్తు ప్రదర్శన శాలను సందర్శించారు. ఆసక్తికరమైన అనంత చరిత్ర విశేషాలను తెలుసుకున్నారు. ప్రీ హిస్టారిక్ నుంచి ఆధునిక కాలం వరకు మానవుడు ఉపయోగించిన పనిముట్లు, కుండలను, టెర్రకోట బొమ్మలు, సున్నపు బొమ్మలు, పురాతన ఇటుకలు, బ్రాంజెస్, పెయింటింగ్స్ తదితర వాటి గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మ్యూజియంలో అంటిక్విటీస్ క్రమపద్ధతిలో అమర్చిన పద్ధతి ఎంతో బాగుందని కితాబిచ్చారు. ఇటువంటి చారిత్రక ప్రదేశాలు అందరికీ ఎంతో ఉపయోగపడతాయన్నారు. జిల్లా స్థాయి మ్యూజియంలను ఒకే గొడుగు కిందకు తెచ్చినట్లయితే ప్రయోజనకరంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. మ్యూజియం నిర్వహణకు కంపెనీలతో మాట్లాడి నిధులు తీసుకురావడానికి సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. అంతకు ముందు మ్యూజియం ఏడీ రజిత, ఇతర సిబ్బంది ఆయన్ను సత్కరించారు.



పురావస్తు శాఖ ఏడీతో కలిసి మ్యూజియంను సందర్శించిన విలాస్ పాండే

నవోదయ ఫలితాల్లో రఘు స్కూల్ విద్యార్థుల ప్రతిభ



అతిబా అఫ్నాన్



సాయిశ్రీ శశిధర్



భువన్ సాత్విక్



నిస్వార్థ



లిఖిత బాయి

అనంతపురం సెంట్రల్: జవహర్ నవోదయ ఫలితాల్లో నగరంలో సంగమేష్ నగర్‌లోని రఘు సైనిక్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. శుక్రవారం వెలువడిన ఫలితాల్లో అతిబా అఫ్నాన్, సాయి శ్రీ శశిధర్, భువన్ సాత్విక్, నిస్వార్థ, లిఖిత బాయి సీట్లు సాధించినట్లు స్కూల్ డైరెక్టర్ రాఘవేంద్ర తెలిపారు. గత 15 సంవత్సరాలుగా నవోదయ, సైనిక్, ఆర్ఎంఎస్, ఆర్ఐఎంఎస్ తదితర పోటీ పరీక్షల్లో రఘు స్కూల్ విద్యార్థులు ప్రభంజనం సృష్టిస్తున్నారని వివరించారు. రెసిడెన్షియల్‌తో పాటు హాస్టల్ వసతి కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటికే ప్రత్యేక బ్యాచ్‌లు ప్రారంభించినట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేందుకు విశేషంగా కృషి చేసిన అధ్యాపకులు, సీట్లు సాధించిన విద్యార్థులను అభినందించారు.

పాస్టర్ చంద్రశేఖర్ సేవలు మరువలేనివి

అనంతపురం కల్చరల్: పాస్టర్ చంద్రశేఖర్ అనేక దశాబ్దాల పాటూ ఆధ్యాత్మిక సేవలందించారని జిల్లా పాస్టర్ల వెల్ఫేర్ సంఘం అధ్యక్షుడు నెహెమ్యా నాగరాజు అన్నారు. శుక్రవారం పాస్టర్ల సంఘం మాజీ ట్రెజరర్ ఆర్‌జీ చంద్రశేఖర్ మృతి చెందారు. విషయం తెలుసుకున్న పలువురు సంఘం కాపరులు ఆర్‌జీ చంద్రశేఖర్ మృతదేహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు రెడ్డివారి నెహెమ్యా నాగరాజు, పాస్టర్ మార్క్, జీవన్ తదితరులు మాట్లాడుతూ.. చంద్రశేఖర్ కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలియజేశారు. వారి స్మృత్యర్థం మరో కూడిక ద్వారా నివాళులర్పిస్తామన్నారు. భగవంతుడి వద్దకు చేరుకున్న చంద్రశేఖర్ కుటుంబానికి పాస్టర్ల సంఘం అండగా నిలస్తుందన్నారు. ఎంతో మందికి మానసిక ప్రశాంతత ఇచ్చేలా వాక్యపరిచర్య చేసేవారని ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. అంతకు ముందు సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం కార్యనిర్వాహక సభ్యులు పాస్టర్ జాషువా జహంగీర్, రూపాస్ కుమార్, శాంతవర్ధన్, గుత్తి పాస్టర్ల అసోసియేషన్ అధ్యక్షుడు వైపీ బాబు, కళ్యాణదుర్గం అసోసియేషన్ కన్వీనర్ పాస్టర్ జేమ్స్‌పాల్ నాయక్, ఏసుకృపా మందిరం పాస్టర్ నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



చంద్రశేఖర్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న పాస్టర్లు

రేపు బ్రాహ్మణ ఐక్యవేదిక సమావేశం

అనంతపురం కల్చరల్: ఐక్యత లేక అభివృద్ధికి నోచుకోని బ్రాహ్మణ సంఘాలన్నింటినీ ఒక తాటిపైకి తెచ్చేందుకు అన్ని సంఘాల వారిని కలుపుకుని ఈనెల 7న బ్రాహ్మణ ఐక్య వేదిక ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు బ్రాహ్మణ సంఘం నాయకులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక మొదటి రోడ్డు శివాలయంలో ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు, అనంతరం బ్రాహ్మణ ఐక్యవేదిక సమావేశం ఉంటుందన్నారు. మధ్యాహ్నం భోజన వసతి కల్పిస్తున్నామని అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

అనంతపురము డివిజన్

9912220719, 9912220732, 9912220724, 9010223702, 9010567770, 9010588846, 9912220727